# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్-న్యూజిలాండ్ "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం" (FTA) విజయదశమి సందర్భంగా రేపటి నుండి అమల్లోకి రానుంది.
- ❖ తజికిస్థాన్ లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశంలో భారత్ తరపున రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రేపు పాల్గొననున్నారు.
- ❖ మహా అష్టమి, మహా నవమి పర్వదినాలను దేశ ప్రజలు ఈరోజు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.
- ❖ తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

=====================

భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన `స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం` (FTA) రేపు విజయదశమి సందర్భంగా అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం ద్వారా న్యూజిలాండ్‌కు భారత్ నుంచి ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు టారిఫ్ లేని ప్రవేశం లభించనుంది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ.. ఈ ఒప్పందం 2047 నాటికి `వికసిత్ భారత్` సాధించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), హస్తకళాకారులు, రైతులు, ఔషధ రంగానికి చెందిన ఎగుమతిదారులకు ఈ ఒప్పందం ద్వారా గణనీయమైన కొత్త అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య వస్తువులు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసి.. సుమారు 35 వేల కోట్ల రూపాయలకు చేర్చాలనే లక్ష్యంతో ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ప్రభుత్వాధినేతల మండలి 25వ సమావేశంలో పాల్గొనేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తజికిస్థాన్ రాజధాని దుషాంబేకు బయలుదేరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం రేపటి నుంచి ప్రారంభమవుతుంది. వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, అనుసంధానత, నూతన ఆవిష్కరణలు, ప్రజా సంబంధాల బలోపేతంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. అదే విధంగా ఎస్‌సీఓ సంస్థ ఆర్థిక, సంస్థాగత కార్యకలాపాల నిర్వహణలో సాధించిన పురోగతిని సమీక్షించనున్నారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య బహుపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశం ప్రముఖంగా దృష్టి సారించనుంది.

=====================

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రక్రియ దాదాపు పూర్తయిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్‌లో ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రష్యా నుంచి చమురు గ్యాస్ కొనుగోలు చేసే దేశాలకు ఆంక్షల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇవ్వాలన్న అమెరికా నిర్ణయాన్ని సమర్థించారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన లభ్యతను కొనసాగించడం, ధరలపై ఒత్తిడిని తగ్గించడం ఈ నిర్ణయం లక్ష్యమని రూబియో వివరించారు. విదేశాంగ విధానానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రతి దేశం తన భౌగోళిక పరిస్థితులు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను పొందడంలో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

(వాయిస్ 26 సెకన్లు)

ఇక భారత పర్యటన నిమిత్తం మార్కో రూబియో రేపు ముంబైకి రానున్నారు. అక్కడ భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌తో సమావేశం కానున్నారు.

=====================

మహా అష్టమి, మహా నవమి పర్వదినాలను దేశ ప్రజలు ఈరోజు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మహా అష్టమి పూజలు ఉదయాన్నే ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని మహాగౌరి రూపంలో పూజించారు. బేలూరు మఠంతో పాటు రామకృష్ణ మఠం మిషన్‌కు చెందిన ఇతర కేంద్రాలు, పలు హిందూ మఠాలు, సామూహిక దుర్గాపూజ మండపాలు, గృహాల్లో పూజలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో నవరాత్రుల తొమ్మిదో రోజైన మహా నవమిని భక్తులు అత్యంత వైభవంగా జరుపుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలు, శక్తిపీఠాలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇక బలరాంపూర్‌లోని మా పటేశ్వరి ఆలయం, జౌన్‌పూర్‌లోని మా శీతల చౌకియా ధామ్, అయోధ్యలోని దేవకాళి ఆలయం, సీతాపూర్‌లోని లలితాదేవి శక్తిపీఠం వద్ద కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది.

విరామం

=====================

`వికసిత్ భారత్` దార్శనికతను కేవలం మెరుగైన మౌలిక సదుపాయాలతో మాత్రమే సాధించలేమని.. కళలు, సంస్కృతి, వారసత్వం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన `ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాల ప్రదానోత్సవం`లో ఆయన ఈరోజు ప్రసంగించారు. భారతదేశ ఆత్మ, నిజమైన గుర్తింపు సాంస్కృతిక సంప్రదాయాలు.. వారసత్వంలోనే నిక్షిప్తమై ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశం ప్రస్తుతం పరివర్తన దశలో పయనిస్తోందని, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గుర్తింపు, ప్రాభవం పెరుగుతున్నాయని చెప్పారు. ఈ మార్పులో కళాకారులు కీలక పాత్ర పోషించాల్సి

ఉందన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటూనే.. తరతరాలుగా భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటిని భావితరాలకు అందిస్తున్న కళాకారుల సేవలను గజేంద్ర సింగ్ షెకావత్ ఈ సందర్భంగా కొనియాడారు.

(వాయిస్ 29 సెకన్లు)

2024, 2025 సంవత్సరాలకు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రదర్శన కళా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన 106 మంది యువ కళాకారులకు సంగీత నాటక అకాడమీ తరఫున ఈ పురస్కారాలను గజేంద్ర సింగ్ షెకావత్ ప్రదానం చేశారు.

=====================

జపాన్‌లోని ఐచి నగోయా నగరంలో జరుగుతున్న 2026 పారా ఆసియన్ గేమ్స్ లో భారత్ శుభారంభం చేసింది. భారత షూటర్లు మోనా అగర్వాల్, అవని లేఖర మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలో స్వర్ణ, రజత పతకాలు సాధించారు. మోనా అగర్వాల్ క్రీడల రికార్డుతో స్వర్ణ పతకం గెలుచుకోగా, అవని లేఖర రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో ఈ విభాగంలో భారత్ స్వర్ణ, రజత పతకాలతో పోటీల్లో పతకాల ఖాతా తెరిచింది. అలాగే పురుషుల జావెలిన్ ఎఫ్-46 ఈవెంట్‌లో రింకూ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. అదే ఈవెంట్‌లో అజీత్ సింగ్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. పారా ఆసియా గేమ్స్‌లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం, రజతం చేరింది. మహిళల 1,500 మీటర్ల టీ-12, టీ-13 విభాగంలో సౌమ్యకు స్వర్ణం, రాధా వెంకటేశ్‌లు రజత పతకాలు గెలుచుకున్నారు. పతకాలు సాధించిన పారా అథ్లెట్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.

=====================

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. ఆంధ్రప్రదేశ్, కేరళం, మాహే, దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతాల్లో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్, కొంకణ్, గోవా, మహారాష్ట్ర, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, తెలంగాణ, తూర్పు, పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలియజేసింది.

=====================

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ `మెటా` తన సిఫార్సు వ్యవస్థల ద్వారా వినియోగదారులకు ఒకే తరహా లేదా పరిమిత సంఖ్యలోని కథనాలు, అభిప్రాయాలు మాత్రమే అసమానంగా అధికంగా చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రజా శాంతికి విఘాతం కలిగించే, హింసను ప్రేరేపించే లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దారితీసే అవకాశం ఉన్న కంటెంట్‌పై పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటా (MeitY)కు సూచించింది. అలాగే, ప్రస్తుతం జరుగుతున్న బహిరంగ సంఘటనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, గ్రాఫిక్స్ లేదా ఇతర కంటెంట్‌ను ప్రచురించే సందర్భంలో వాటికి తగిన నేపథ్య సమాచారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆ మంత్రిత్వ శాఖ మెటాను కోరింది.

=====================
=====================